క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ పూజారులు

చీపురుపల్లి: చీపురుపల్లి ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మీ అమ్మవారికి ఆలయ పూజారులు ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా ఎర్నమ్మతల్లి తీర్థం



పూజలందుకుంటున్న ఎర్నమ్మతల్లి

లక్కవరపుకోట: మండంలోని జమ్మాదేవిపేట గ్రామంలో ఎర్నమ్మతల్లి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఉదయం నుంచే గ్రామస్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం జిల్లా స్థాయి గుర్రాల పరుగు పందెం నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బోజింకి ఎర్నాయుడు, కిరణ్‌కుమార్, వరహాలుబాబు నగదు బహుమతులు అందజేశారు.

కరాటేతో ఆత్మరక్షణ



కరాటేలో వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులతో మాస్టర్ లక్ష్మణరావు

కొత్తవలస: ఆత్మరక్షణ, దేహధారుద్యానికి కరాటే ఎంతో దోహదపడుతుందని టోనిజా మార్షల్ ఆర్ట్స్ కరాటే డో-అకాడమీ మాస్టర్ ఎం.లక్ష్మణరావు అన్నారు. కరాటేలో శిక్షణ పొందిన వివిధ పాఠశాలల విద్యార్థులకు స్థానిక విజ్ఞాన భారతి పాఠశాల మైదానంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు ఆదివారం నిర్వహించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు వివిధ రకాల బెల్టులు, సర్టిఫికెట్లను పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను శతశాతం వసూలు చేయాలి

మెరకముడిదాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లు శతశాతం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ పి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. మండలంలో ఇప్పటి వరకు ఇంటిపన్ను వసూళ్లు 84 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. మండలం మొత్తం రూ. 37,49,784 వసూలు చేయాల్సి ఉండగా రూ. 22,83,079 వసూలు అయ్యిందని తెలిపారు. మిగిలిన 16 శాతం త్వరగా వసూలు చేసి మండలాన్ని జిల్లాలో ప్రథమస్థానంలో నిలపాలని సిబ్బందిని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, జేవీవీ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్ష విజేతలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ మినిస్ట్రీల్ హాల్‌లో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన సీనియర్ ఇంజినీర్ శివానంద్, జేవీవీ నాయకులు రమణ ప్రభాత్ మాట్లాడుతూ ఏటా ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టేందుకు ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పరీక్షలో విజేతలను అభినందించారు. జిల్లాలో 96 మార్కులతో మొదటి స్థానంలో పాగిరి శ్యామల(రాజాం) నిలవగా, 95 మార్కులతో జయేంద్రనాయుడు(విజయనగరం) రెండోస్థానం, లావణ్య(గంట్యాడ),దిలీప్(నెల్లిమర్ల) మూడోస్థానంలో నిలిచారు. వీరికి నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షు డు వెంకటేష్, పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో మేలు

రామభద్రపురం: వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే సాగు సమయంలో కలుపు బెడద అధికంగా ఉంటుంది. కలుపు మొక్కలు భూమిలోని నీరు, పోషక పదార్థాలను గ్రహించి పెరుగుతాయి. దీంతో భూమి లోపలి పొరల్లో నీరు హరించుకుపోయి భూసారం తగ్గుతుంది. ఈ క్రమంలో రైతు వేసిన పోషకాలు కూడా లభించవు. దుక్కిలో బయటపడిన పురుగులను సైతం పక్షులు తినడం వల్ల చీడపీడల బెడద కూడా తగ్గుతుంది. మరింత లోతుగా దుక్కి చేసినట్లయితే పంటలకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. ఈ నేపథ్యంలో రైతులు వేసవి దుక్కులు చేసుకోవడం మేలు అని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

చెరువులకు అమృత్ యోగం

- 'మిషన్ అమృత్ సరోవర్' పథకంలో భాగంగా చెరువుల అభివృద్ధి
- జిల్లాలో 75 చెరువుల ఎంపిక
- దాదాపు పూర్తయిన పనులు



ఎస్.కోటలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన అవుర్లు బంద



ఎస్.కోట మండలం వెంకటరమణపేటలోని జవ్వాది చెరువు



వెంకటరమణపేటలోని జవ్వాది గట్టుపై ప్లాంటేషన్

శృంగవరపుకోట: అమృత్ సరోవర్ పథకం ద్వారా జిల్లాలో పలు చెరువులు,కోనేరులకు మహర్దశ పట్టింది. భూగర్భ జలాలు పెంపొందించడం, వ్యవసాయ భూములకు సమృద్ధిగా సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉపాధి హామీ నిధులతో ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'మిషన్ అమృత్‌సరోవర్' కార్యక్రమాన్ని 2022 ఏప్రిల్ 24న ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రతి జిల్లాలో కొత్తగా కోనేరులు, చెరువులు తవ్వకాలు చేయాలని నిర్ణయించారు. విజయనగరం జిల్లాలో 75 కోనేరులు ఏర్పాటు, అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. స్థలం ఉన్న గ్రామాల్లో కొత్తగా చెరువులు తవ్వించేందుకు, లేని చోట కనీస విస్తీర్ణం ఎకరా ఉన్న పాత చెరువులు,కోనేరులనే ఈ పథకంలోకి తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళికలు తయారు చేసి ఎంపిక చేశారు. ఈ పథకం కింద ఎంపికైన చెరువుల్లో తొలుత ఆక్రమణలు తొలగించి, బౌండరీలు నిర్ధారించారు. అనంతరం పూడికలు తొలగించడంతో పాటు, జంగిల్ క్లియరెన్స్, గట్లు పటిష్టం చేయడం వంటి పనులు చేశారు. గట్లు వెంబడి పలుచోట్ల మొక్కలు నాటారు. అమృత్ సరోవర్‌లు ఎంపిక, పనులు నిర్వహణ, నిధులు ఖర్చు అంతా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో చేపట్టారు. చెరువులను అభివృద్ధి చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.30లక్షలతో మూడు కోనేర్ల అభివృద్ధి

ఎస్.కోట మండల పరిధిలో ఈ పథకం కింద మూడు కోనేర్లు అభివృద్ధికి రూ.29,82,383లతో ప్రతిపాదనలు చేశారు. ఎస్.కోటలో అవుర్లు బందకు రూ.9,95,767 ప్రతిపాదనలు చేసి, రూ.8,47,751 ఖర్చు చేశారు. కిల్తంపాలెంలో వేడువాని చెరువుకు రూ.9,96,616 కేటాయించి రూ.9,44,098 ఖర్చు చేశారు. వెంకటరమణపేటలో జువ్వాదిచెరువుకి రూ.9,90,000 కేటాయించి రూ.5,44,500 ఖర్చు చేశారు.

నవధాన్యాల సాగుతో భూసారం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సబల సంస్థ ప్రతినిధులు

లక్కవరపుకోట: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని సబల సంస్థ కో-ఆర్డినేటర్ కె.ఈశ్వరరావు అన్నారు. నవధాన్యా లు, చిరుధాన్యాల సాగు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై సబల సంస్థ ఆధ్వర్యంలో చందులూరు గ్రామంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబల కో-ఆర్డినేటర్ ఈశ్వరరావు మాట్లాడుతూ పుడమి తల్లి పచ్చగా ఉండేలా 365 రోజులూ పంటలు సాగు చేసే విధానాన్ని వివరించారు. ఖరీఫ్ ప్రధాన పంట వేసే ముందు 12 నుంచి 18 రకాల నవధాన్యాల విత్తనాలను ఎకరానికి 12 కిలోల వరకు చల్లాలని చెప్పారు. 45 రోజుల తర్వాత పెరిగిన చేనును కలియదున్నడం వల్ల భూమికి కావల్సిన పోషకాలు లభిస్తాయని, భూసారం పెరుగుతుందన్నారు. వీటి సాగు వల్ల రసాయన ఎరువులు,పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం మహిళలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వివాదాలు వీడి.. గ్రామాభివృద్ధి చేసుకోండి



సర్పంచ్, వార్డు మెంబర్లతో సమావేశమైన ఎంపీడీఓ రూపేష్

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామంలో వీధి కుళాలయి ఏర్పాటుకు సంబంధించి తలెత్తిన వివాదం తాత్కాలికంగా సద్దుమణిగిందని, గ్రామాభివృద్ధి పనుల విషయంలో వివాదాలకు దిగకుండా అంతా సమన్వయంతో ముందుకుసాగాలని ఎంపీడీఓ కె.రూపేష్ ఆ గ్రామస్తులు, సర్పంచ్‌కు సూచించారు. గ్రామంలో స్థానిక ఆంజనేయ మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ నిధులతో చేపడుతున్న వీధి కుళాయిల నిర్మాణ పనులను సర్పంచ్ అడ్డుకుంటున్నారని ఎంపీడీఓకు ఆ గ్రామ మహిళలు, యువత శనివారం ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ కె.రూపేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రకళ మార్లాపల్లిలో ఆదివారం పర్యటించి కుళాయిల పనులను పరిశీలించారు. అనంతరం సర్పంచ్, వార్డు మెంబర్లతో సమావేశమయ్యారు. వీధి కుళాయిల ఏర్పాటు పనులు గ్రామానికి ఎంతో ఉపయోగమైనవని అధికారులు అన్నారు. పనులు చేపట్టిన మహిళా సంఘం సభ్యులు, సర్పంచ్‌కు మధ్య కొద్దిపాటి సమాచార లోపం కారణంగా, వివాదం తలెత్తినట్లుగుర్తించామన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులే కాకుండా మరి కొన్ని చేయాల్సినవి ఉన్నాయని, వాటన్నింటికీ పంచాయతీలో తీర్మానించాక చేస్తామని సర్పంచ్ గోగాడ సత్యం తన అభిప్రాయం తెలిపారని ఎంపీడీఓ చెప్పారు.

కూన రవి క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న యాదవ సంఘం ప్రతినిధులు

విజయనగరం ఫూల్‌బాగ్: టీడీపీ నేత కూన రవికుమార్ యాదవులకు క్షమాపణలు చెప్పాలని యాదవ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధు యాదవ్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఉత్తరాంధ్ర మంత్రులు గొర్రెలు కాసే వారి కన్నా హీనమని ఆయన మాట్లాడడం యాదవులను కించపరచడమేనన్నారు. ఇదే విషయమై ఆదివారం మీడియాతో మాట్లాడిన మధు యాదవ్ కూన రవి మాటలు యాదవులను బాధించాయని, అలా మాట్లాడడం ఎంతమాత్రం సరికాదన్నారు. తమ కులవృత్తిని దైవంగా భావిస్తున్నామని, అటువంటి వృత్తిపై ఆయన తప్పుడు వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమన్నారు. దీనిని యావత్తు యాదవ సంఘం ఖండిస్తోందన్నారు. యాదవులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గదుల సత్యలత యాదవ్, జిల్లా యాదవ సంఘం నాయకులు బి.అప్పారావు యాదవ్, జిల్లా లీగల్ కన్వీనర్ గువ్వల తిరుపతిరావు యాదవ్ పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ రాయితీని సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ప్రభుత్వం అందిస్తున్న ఆస్తి పన్ను వడ్డీ మాఫీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో కలిసి పన్ను బకాయిదారులను కలిసి, వడ్డీ మాఫీపై అవగాహన కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు గత బకాయిలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందన్నారు. కేవలం పన్నులు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. పన్నులు చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధికి సహకరించిన వారవుతారని, అందరూ పన్నులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఆర్ఐ త్రినాథ్, సిబ్బంది విజయ్, రంగా తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ఆందోళన

గుర్ల: అకాల వర్షాలతో మండలంలో చోడిపంట సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండురోజులుగా వర్షాలు కురుస్తుండగా, మరోరెండురోజుల పాటు వర్షాలప్రభావం ఉండనుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలో పల్లిగండ్రేడు, గుర్ల, గరికివలస, కోటగండ్రేడు, చింతలపేట , కెల్ల, గుజ్జింగివలస, జమ్ము, జమ్ముపేట తదితర గ్రామాల్లో చోడిపంట కోత దశకు చేరుకుంది. కొంతమంది రైతులు ఇప్పటికే కోతలు చేసి చేనును పొలాల్లో ఉంచేశారు. వర్షానికి పంట తడిచిపోయిందని, మొలకలు వచ్చిపాడైపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దుమ్మెద ఫీడర్ పరిధిలోని కోనూరు, అర్తమూరు, దుమ్మెద, దేవాడ, నడిపేనపేట గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తనుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎస్.కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లారీ బోల్తా



ప్రమాద ఘటనలో బోల్తా పడ్డ క్వారీ లారీ

శృంగవరపుకోట: మండలంలోని పాతఅలుగుబిల్లి గ్రామం వద్ద ఉన్న స్థానిక క్వారీల నుంచి ఆదివారం పిక్కలోడుతో వస్తున్న ఓ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. లారీ అదుపుతప్పిన సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత పనులు వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. కొనిస ప్రాజెక్టు పరిధిలోని దేవుపల్లి, బి.రాజేరు, ఎం.కొత్తవలస, గొల్లుపాలెం, కనిమెరక, మరువాడ తదితర గ్రామాలతో పాటు గొట్లాం ప్రాజెక్టు పరిధి గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలు ట్యాంకులను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ట్యాంకులకు అవసరమైన మరమ్మతులు సంబంధిత శాఖ సిబ్బంది పర్యవేక్షణలో చేపడుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖాళీగా ఉన్న 10 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 అంగన్‌వాడీ సహాయకులు, మరో 15 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సాధికారత అధికారిణి బి.శాంతకుమారి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఖచ్చితంగా పదో తరగతి ఉత్తీర్ణత పొందాలని, అలాగే తె లుగు చదవడం, రాయడం బాగా రావాలన్నా రు. 01-07-2022 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.7 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

కుట్టుమిషన్ అందజేత



కుట్టుమిషన్ అందిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు లత

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న కేజీబీవీ విద్యార్థులకు కుట్టుమిషన్‌తో పాటు క్రాఫ్ట్ మెటీరియల్‌ను ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు లత ఆదివారం అందజేశారు. విద్యార్థుల చేతి నైపుణ్యానికి ఇవి ఉపకరిస్తాయని భావించి, వీటిని ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత



ఖలీలుల్లాకు నగదు, టీషర్ట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

శృంగవరపుకోట: జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు పట్టణానికి చెందిన మహమ్మద్ ఖలీలుల్లా ఎంపికయ్యారు. క్రీడాకారుడిని స్థానిక ఎఫ్ఆర్‌సీలో ఆదివారం సత్కరించారు. ఈసందర్భంగా ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.శ్రీరాములు మాట్లాడుతూ మహ్మద్ ఖలీలుల్లా ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం సాధించి, గోవాలో నిర్వహించనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించారని చెప్పారు.ఖలీలుల్లాకు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, 'స్నేహ' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఏ.ఎస్. వెంకటరావు, ఎ.రమేష్, మోహన్ రూ.10వేలు, స్థానిక ముంతాజ్ హోటల్ యజమానులు షేక్ షిలార్ బ్రదర్స్ రూ.10వేలు, ప్రొద్దుటూరుకి చెందిన షేక్ మగ్దుం రూ.5వేలు, లీనింగ్ బ్యాడ్మింటన్ షూష్‌ను అందచేశారు.

వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాలవర్మ

జామి: వృద్ధులను గౌరవంగా చూసుకోవాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ అన్నారు.మండలంలోని అట్టాడ గ్రామంలోని బీఎస్ఆర్ ఆశ్రమం వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధులు సమాజానికి అందించిన సేవలు నేటి తరం యువత మరిచిపోకూడదన్నారు. వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఆశ్రమంలో వృద్ధులకు అలమండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే పారిశ్రామికవేత్త డి.ఎస్.టి.నాయుడు,సుస్మా దంపతులు వృద్ధులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు,సమన్విత ఏజెన్సీ అధినేత జి.నాగిరెడ్డి, మాతృభూమి సేవాసంఘం నిర్వాహకులు ఇప్పలవలస గోపి, ఆశ్రమం నిర్వాహకుడు భీశెట్టి ఆదిబాబు, శారదా, బాలభార్గవి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ కార్యాలయాల్లో స్పందన

గజపతినగరం/ బొండపల్లి/ దత్తిరాజేరు/ కొత్తవలస/లక్కవరపుకోట: ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, కొత్తవలస, లక్కవరపుకోట మండలాల ఎంపీడీఓలు పప్పు సుదర్శనం, ఎ.వేదవతి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, వై.పద్మజ, కె.రూపేష్ ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మండల అధికారులు, డీడీఓలు హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గత రెండు వారాలు స్పందన కార్యక్రమం నిర్వహించలేదని, ఇక నుంచి ప్రతీ సోమవారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10: 30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం మధ్యాహ్నం స్పందన కార్యక్రమం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పంటవ్యర్థాలను పొలాల్లో తగలబెట్టొద్దు



పుర్రేయవలసలో మొక్క జొన్న వ్యర్థాలను పొలంలోనే కాల్చిన రైతులు

చీపురుపల్లిరూరల్: పంట కోత అనంతరం చాలా మంది రైతులు వ్యర్థాలను పొలాల్లో తగలబెడుతున్నారని, ఇలా చేయడం వల్ల భూసారం కోల్పోవడంతో పాటు వాతావరణం కాలుష్యం అవుతుందని ఏఓ సీహెచ్.రఘునాథ్ అన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట కోతలు చేసిన రైతులు వ్యర్థాలను పొలాల్లోనే తగలబెడుతున్నారని, ఇలా చేయడం వల్ల నేలలోని పోషకగుణాలు నష్టపోవడమే కాకుండా మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతున్నాయని వ్యర్థాలను కాల్చకుండా స్టాక్‌బస్టర్‌ను ఉపయోగించి భూమిలో కలియదున్నాలని సూచించారు. ఇలా చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం, పోషకాలు పెరుగుతాయని, తద్వారా నేల సారవంతమవుతుందని చెప్పారు.

క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగవకాశాలు



జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన శ్రావణి, కౌశిక్‌లను అభినందిస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఈ బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు కోచ్ డీవీ చారి ఆధ్వర్యంలో ఆమెను నగరంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఎంతోమంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన ఎంతోమందికి ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయ రంగంలో ఉన్నత పదవులు దక్కుతున్నాయన్నారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఫెన్సింగ్ క్రీడాకారులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు డిప్యూటీ స్పీకర్‌తో మాట్లాడి, తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తెలుగు సంప్రదాయ పరిరక్షణకు కృషి



మహాకవి గురజాడకు నివాళులర్పిస్తున్న కట్టమూరి చంద్రశేఖరం తదితరులు

విజయనగరం టౌన్: తెలుగు సంప్రదాయ పరిరక్షణకు సాహితీ సంస్థలు కృషి చేయాలని ప్రముఖ అవధాన పండితులు కట్టమూరి చంద్రశేఖరం పిలుపునిచ్చారు. స్థానిక గురజాడ స్వగృహంలో సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. భావితరాలకు మంచి సంప్రదాయం అందించాలని కోరారు. అనంతరం ఉగాది సందర్భంగా నిర్వహించిన కవితలు, వ్యాసాలు, పాటలు, పద్య పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మహాకవి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. గురజాడ మునిమనవడు గురజాడ వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రచయిత్రులు చివుకల శ్రీలక్ష్మి, మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకాంతి, సంస్థ ప్రతినిధులు రామ్‌కుమార్, శేఖర్, గురజాడ ఇందిర తదితరులు పాల్గొన్నారు.